క్లుప్తంగా

స్కేటింగ్ పోటీల్లో విద్యార్థిని సత్తా


ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన ప్రియవర్షిణి

మహారాణిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరంలోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాల ఐదో తరగతి విద్యార్థిని ప్రియవర్షిణి ప్రథమ స్థానంలో నిలిచింది. గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 31, నవంబర్ 1 తేదీల్లో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. ప్రియవర్షిణి సోదరుడు నియాన్(మూడో తరగతి) కూడా ఈ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆదివారం ప్రియవర్షిణిని గాయత్రి విద్యా పరిషత్ యాజమాన్యం డి.దక్షిణామూర్తి, డాక్టర్ పి.సోమరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి తదితరులు అభినందించారు.

వైభవంగా శత చండీయాగం


శ్రీలలితా పీఠంలో చండియాగం నిర్వహిస్తున్న వైదికులు

సీతంపేట : శ్రీలలితా పీఠంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాలు, శత చండీయాగం శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. 108 ద్రవ్యములు, వివిధ రకాల పండ్లు, పట్టు చీరలు పూర్ణాహుతిలో సమర్పించారు. వేద పండితుల మంత్రాల మధ్య మహా పూర్ణాహుతి, మహా స్నపనం, దీక్షా విరమణ, వేదాశీర్వాదంతో ఉత్సవాలు ముగించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు లలితా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. సాయంత్రం జమ్మి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు.

రావణుడిపై రాముడి గెలుపే విజయదశమి


ప్రత్యేక పేలుడు బాణసంచాతో రావణవధ

తగరపువలస: త్రేతాయుగమున దశానన రావణునిపై శ్రీరామచంద్రుని విజయానికి సంకేతంగా విజయదశమి జరుపుకొంటారని హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస అన్నారు. ఇందుకు ప్రతీకగా ఉత్తరాది రాష్ట్రాలలో విజయదశమి నాడు 'రావణ వధ' నిర్వహిస్తారన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో వైభవంగా జరుపుకొనే ఈ ఉత్సవాన్ని మొదటిసారి విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో 'రావణ వధ' నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అడుగుల ఎత్తు కలిగిన రావణుడి భారీ కటౌట్‌ను ప్రత్యేక బాణసంచాతో దహనం చేశారు. అంబరీష దాస మాట్లాడుతూ చెడుపై మంచి గెలుపే విజయదశమి అన్నారు. అంతకు ముందు నిష్కించిన భక్తదాసచే శ్రీరామ అష్టోత్తర హోమం, శ్రీరామలీలా ప్రవచనం, మహా మంగళహారతి నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు.

దర్జాగా పాగా..!

- ఆక్రమణలో నౌకానగర్ జీవీఎంసీ పార్క్ స్థలం
- యథేచ్ఛగా వ్యాపార కార్యకలాపాలు
- పట్టాలెక్కని పార్క్ అభివృద్ధి పనులు
- పట్టించుకోని జోన్‌–3 అధికారులు


నౌకానగర్‌లోని జీవీఎంసీ పార్కు స్థలంలో నిర్వహిస్తున్న ఫుడ్ కోర్టులు

ఎంవీపీకాలనీ: స్థానిక 20వ వార్డు నౌకానగర్‌లోని జీవీఎంసీ పార్కు స్థలం ఆక్రమణకు గురైంది. నౌకానగర్ మాస్టర్ ప్లాన్‌లో పార్కు నిర్మాణం కోసం కొంత స్థలాన్ని దశాబ్దాల కిందట జీవీఎంసీ కేటాయించింది. అక్కడ పార్కు నిర్మాణం జరగకపోవడంతో కొందరి కళ్లు ఆ స్థలంపై పడ్డాయి. దీంతో విశాఖ ఐ హాస్పిటల్‌ను ఆనుకొని ఉన్న ఈ పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమించి దర్జాగా వినియోగించుకుంటున్నారు. కమర్షియల్‌గా వాడుకుంటూ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. పార్కు స్థలంలోని మెజారిటీ భాగాన్ని ఓ వ్యక్తి కార్ మెకానిక్ షెడ్‌గా వినియోగిస్తుండగా.. మరికొందరు ఆప్టికల్ షాపు, ఫాస్ట్‌ఫుడ్, టిఫెన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. పార్కు స్థలాన్ని పూర్తిస్థాయిలో ఆక్రమించి వారి సొంత వ్యాపారాలకు వాడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పార్కు పరిరక్షణ విషయంలో జీవీఎంసీ జోన్‌–3 అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.



పార్కు స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన కార్ మెకానిక్ షెడ్

రూ.8 లక్షలతో అంచనాలు..

నౌకానగర్ పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకొని పూర్తిస్థాయిలో పార్కును అభివృద్ధి చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. పార్కు ఏర్పాటు కోసం స్థానిక అడ్వకేట్ న్యాయ పోరాటం చేస్తుండటంతోపాటు 20వ వార్డు కార్పొరేటర్ 2023లో జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి చర్యలకు డిమాండ్ చేశారు. దీంతో చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు కౌన్సిల్ ఆదేశాలు సైతం జారీ చేసింది. ఈ నేపథ్యంలో కౌన్సిల్ సూచనలకు అనుగుణంగా అధికారులు పార్కు అభివృద్ధికి ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. రూ.8 లక్షల వ్యయంతో తొలిదశగా పార్కు అభివృద్ధికి అంచనాలు రూపొందించినట్లు ప్రకటన సైతం విడుదల చేశారు. నేటికీ ఆ ప్రకటన కార్యరూపం దాల్చలేదు. కొందరు ఆక్రమణదారుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గడంతోనే ఈ పనులు పట్టాలెక్కలేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


ఏఆర్ కార్యాలయంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న అనకాపల్లి ఎస్పీ దీపిక

ఆరిలోవ: శాంతిభద్రతల పరిరక్షణకు దృఢ సంకల్పంతో కృషి చేయాలని పోలీసులకు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక సూచించారు. విజయదశమి సందర్భంగా శనివారం విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు ఆయుధ పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె జిల్లా పోలీస్ అధికారులతో కలిసి దుర్గాదేవికి పూజలు చేశారు. అనంతరం సిబ్బంది వారు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు నిరంతరం కష్టపడుతున్నారన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పోలీస్ వ్యవస్థలో ఆయుధాలు ఒక భాగన్నామని, వాటిని అందరూ గౌరవించాలని కోరారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, వి.సత్తిరాజు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు బాలసూర్యారావు, సతీష్, మన్మధరావు, నర్సింహమూర్తి, ఎస్‌ఐలు నాయుడు, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మి చెట్లు పెంచాలి

సీతమ్మధార : ప్రజలంతా విధిగా జమ్మి చెట్లు నాటి పెంచాలని కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి డాక్టర్ సుంకరి రామకృష్ణారావు కోరారు. సీతమ్మధారలోని జీవీఎంసీ పార్కులో జమ్మిచెట్టు నాటిన తర్వాత ఆయన మాట్లాడారు. తులసి, ఉసిరి, మారేడు, వేప, మోదుగ, రావి, జమ్మి వంటి ఆయుర్వేద గుణాలు గల చెట్లను దేవతా వృక్షాలుగా భావించి పూజిస్తామని గుర్తు చేశారు. ఆయుర్వేద మందులలో జమ్మి చెట్టు ఆకులు, పువ్వులు, విత్తనాలు, చెట్టు బెరడు ఉపయోగిస్తారన్నారు. జమ్మి పసరు రాసుకుంటే కుష్టు వ్యాధి కూడా తగ్గుతుందని స్పష్టం చేశారు. అందుకే ఈ చెట్టుకి సురభి బంగారం అని పేరు వచ్చిందని గుర్తు చేశారు.

ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రానికే ముప్పు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రం భారీగా నష్టపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1,340వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ఆయువు పట్టువంటి విశాఖ ఉక్కును అమ్మేస్తే రాష్ట్రానికి వెన్నెముక విరిగినట్టే అన్నారు. దసరా పండగకు బోనస్ చెల్లించాల్సిన ఉక్కు యాజమాన్యం కనీసం జీతాలు కూడా చెల్లించకుండా కావాలనే కార్మికులను, వారి కుటుంబ సభ్యులను మానసికంగా వేధిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

సాయి మందిరంలో సామూహిక దీపారాధన


చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


దీపారాధన ప్రారంభిస్తున్న జీవీఎంసీ ఏడీసీ-1 సోమన్నారాయణ

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరంలో విజయదశమి సందర్భంగా శనివారం రాత్రి సామూహిక దీపారాధన ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌–1 రేలంగి సోమన్నారాయణ మొదటి దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు మందిర ఆవరణలో అరటి చెట్లు, టేబుళ్లతోపాటు స్టాండ్‌పై 18,000 ప్రమిదలు ఏర్పాటు చేశారు. చినగదిలి, పెదగదిలి, సంతపాలెం, ఆరిలోవ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వాటిలో దీపాలు వెలిగించారు. దీంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా సాయి మందిరం చైర్మన్ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ ప్రతి ఏటా విజయదశమి సందర్భంగా దీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌–2 రమణమూర్తి, జోన్‌–2 కమిషనర్ సింహాచలం, రికార్డైంట్ ఇండియా కంపెనీ కో ఫౌండర్ ఆర్.ఎస్ విన్నీ పాత్రో, ఎస్‌వీపీ హోటల్ అధినేత పప్పల సత్యనారాయణ పాల్గొన్నారు.

శిల్పారామంలో ముగిసిన సంబరాలు


కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో కొద్ది రోజులుగా జరుగుతున్న దసరా సంబరాలు శనివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా శాస్త్రీయ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే సాయిబాబా మరణం


సాయిబాబాకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు


సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం సాగించిన హింస వల్లనే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణించారని విశాఖ పౌర ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం జరిగిన సాయిబాబా సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ న్యాయమైన, నూతన సమాజం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని వారు కొనియాడారు. సుదీర్ఘమైన జైలు జీవితం వల్లనే ఆయన ఆరోగ్యం పాడైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన 90 శాతం దివ్యాంగుడు అయినా సరే బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో శనివారం సాయిబాబా మరణంతో ప్రజలు నిజమైన పోరాట యోధుడిని కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, ఐఫ్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, బూసి వెంకటరావు, ఎస్.వెంకటలక్ష్మి, ఏడుకొండలు, కేఎస్ చలం, ఎం.పైడిరాజు, జీడీ సారయ్య, రాజు, ఎన్.నాగభూషణరావు, వామనమూర్తి, వి.నల్లయ్య, ఎస్.ఆదినారాయణ తదితరులు మాట్లాడారు.

సత్ప్రవర్తనతో మెలగకుంటే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ శ్రీను

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌ఐ శ్రీను సూచించారు. ఈ మేరకు ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు సీఐ డి.వి. రమణ ఆదేశాల మేరకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలు సేకరించారు. అనంతరం ఎస్‌ఐ శ్రీను మాట్లాడుతూ ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలు, అల్లర్లు చేసినా, మద్యం సేవించి షాపుల వద్ద గొడవలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు.

సంప్రదాయాల రక్షణ ముఖ్యం


డాక్టర్ కేఎస్ శాస్త్రిని సత్కరిస్తున్న చింతలపాటి సత్యదేవ్ తదితరులు

తాటిచెట్లపాలెం: భారతీయ సంస్కృతి పరిరక్షణకు సనాతన సంప్రదాయాన్ని పాటించడమే ముఖ్యమని జగద్గురు పీఠం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి అన్నారు. తాటిచెట్లపాలెం మాస్టర్ హోమియో వైద్యాలయంలో దుర్గాదేవి పూజా మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.) వద్ద తాము పొందిన ప్రేరణతో వేద సూక్తాలను నేర్పిస్తున్నామన్నారు. జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఉచిత హోమియో వైద్యసేవలను ఒక తపస్సుగా నిర్వహిస్తున్న ఆదర్శనీయుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి అని కొనియాడారు. అనంతరం డాక్టర్ శాస్త్రి 120 మంది పేద మహిళలకు చీరలు అందించారు. మద్దూరి హనుమంతరావు, సిహెచ్.నరసింహమూర్తి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దసరా వేళ.. నాటుకోళ్లకు ఫుల్ గిరాకీ


డెయిరీఫారం నాటుకోళ్ల సంత వద్ద మాంసం ప్రియులు, రోడ్డుపై నిలిపిన వాహనాలు


విక్రయానికి సిద్ధం చేసిన నాటుకోళ్లు

ఆరిలోవ: దసరా పండగ సందర్భంగా నాటుకోళ్ల సంత ఆదివారం సందడిగా మారింది. జాతీయ రహదారి పక్కన పాత డెయిరీఫారం వద్ద సాధారణంగా ఆదివారం, మంగళవారం రద్దీగా ఉంటుంది. దసరా కావడంతో ఎక్కువ మంది నాటుకోడి కొనేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఈ సంతకు నగరంలోని పలు ప్రాంతాలతోపాటు విశాలాక్షినగర్, ఆదర్శనగర్, ఆరిలోవ, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, మద్దిలపాలెం, ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వినియోగదారులు తరలివచ్చి నాటుకోళ్లు కొనుగోలు చేశారు. ఉదయం 6 గంటల నుంచే ఇక్కడ రద్దీ పెరిగింది. వారి వాహనాలను జాతీయ రహదారిపై నిలపడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించారు. అధిక సంఖ్యలో వినియోగదారులు తరలి రావడంతో వ్యాపారుల వద్ద వందల కోళ్ల విక్రయాలు జరిగాయి. నాటుకోడి లైవ్ కిలో రూ.800 చొప్పున విక్రయించారు. వినియోగదారులు కొందరు వాటిని కొని అక్కడే మాంసం తయారు చేయించుకున్నారు. ఈ సంతలో మధ్యాహ్నం వరకు సుమారు 800 కోళ్ల విక్రయం జరిగాయని వ్యాపారులు తెలిపారు. దసరా సందర్భంగా నాటుకోళ్ల సంతతోపాటు మటన్, చికెన్ దుకాణాలు, మద్యం షాపుల వద్ద రద్దీ పెరిగింది. మందుబాబులు పూటుగా మద్యం తాగి సంబరాలు చేసుకున్నారు.


విశాలాక్షినగర్‌లో మటన్ షాపు వద్ద వినియోగదారులు

చండికాదేవి ఆలయంలో అన్నసమారాధన


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్‌–4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. భక్తులు భక్తి సంకీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, కమిటీ ప్రతినిధులు శ్రీహరిరాజు, విశాఖ సమాచారమ్ వీరభద్రరావు, ఉమాదేవి, శ్రీనివాసరావు, రామమోహనరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

- ఎంవీపీ కాలనీ సెక్టార్‌–8లోని శ్రీ సత్యసాయి ప్రేమసదన్‌లో దుర్గాదేవికి అన్నపూర్ణ సహస్రనామార్చన, అభిషేకాలు నిర్వహించారు. ప్రేమసదన్ ఉపాధ్యాయులు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐవీఎల్ శాస్త్రి పేరిట తపాలా స్టాంప్ విడుదల


తపాలా స్టాంప్ విడుదల చేస్తున్న జనకులం ప్రతినిధులు

సీతమ్మధార: సంగీత జనకులం వ్యవస్థాపకుడు ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట రూ.5 విలువ గల తపాలా స్టాంపుని కేంద్ర ప్రభుత్వం ముద్రించడం సంతోషకరమని ఆదాయ పన్ను శాఖ అధికారి వి.నాగ సూర్యారావు అన్నారు. విజయదశమి సందర్భంగా సీతమ్మధారలో శనివారం నిర్వహించిన సంగీతసభలో ఆయన మాట్లాడుతూ ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత ప్రపంచానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కులపతి బుక్ ట్రస్ట్ కార్యదర్శి చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ 20 వేల మందికి శాస్త్రీయ సంగీతంలో ఉచిత శిక్షణ ఇచ్చారని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి చూపిన మార్గంలో సంగీత జనకులం సంస్థ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం వారు స్టాంపు విడుదల చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.విజయప్రసాద్, సిహెచ్.గిరిధర్, సంగీత గురువులు ఐ.రమణిప్రసాద్, ఎస్.లక్ష్మి, శైలేష్ పాల్గొన్నారు.

సందడే సందడి


సందర్శకులతో కళకళలాడుతున్న తెన్నేటి పార్కు


ఆట పరికరాల వద్ద ఆడుకుంటున్న చిన్నారులు

ఆరిలోవ: తెన్నేటి పార్కు సందడిగా మారింది. దసరా సెలువులతోపాటు ఆదివారం కావడంతో ఈ పార్కును ఎక్కువ మంది సందర్శించారు. పిల్లలు, పెద్దలు గంటల తరబడి సరదాగా గడిపారు. పార్కు దిగువన బీచ్‌లో బంగ్లాదేశ్ మా షిప్ వద్ద ఫొటోలు దిగారు. అక్కడ అలలు తక్కువ ఎత్తులో ఉండటంతో స్నానాలు చేస్తూ సందడి చేశారు. నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిని సందర్శించిన వారు సైతం తెన్నేటి పార్కులో కొంతసేపు గడిపి సముద్రం అందాలను తిలకించారు. పిల్లల పార్కులో ఆట పరికరాలతో ఆడుకున్నారు. సాయంత్రం సందర్శకుల సంఖ్య పెరగడంతో పార్కు ముందు బీచ్ రోడ్డు వాహనాల పార్కింగ్‌తో నిండిపోయింది. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కైలాసగిరి, జూ పార్కు, కంబాలకొండ పార్కులు కూడా సందర్శకులతో కళకళలాడాయి. పిల్లలు, పెద్దలు ఆనందంగా గడిపారు.


తెన్నేటి పార్కు వద్ద బీచ్‌లో సందర్శకుల సందడి